క్లుప్తంగా

హెల్మెట్ పెట్టుకోండి.. ప్రాణాలు కాపాడుకోండి



హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పిస్తున్న నల్లపాడు పోలీసులు

గుంటూరు రూరల్: హెల్మెట్ పెట్టుకుని విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలు కాపాడుకోవాలని వాహన చోదకులకు నల్లపాడు పోలీస్ స్టేషన్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం పోలీస్ స్టేషన్ పరిధిలోని గోరంట్ల చిల్లీస్ సెంటర్ నందు వాహన చోదకులకు హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని, సీట్ బెల్ట్ ధరించి కార్లు నడపాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది తదితరులున్నారు.

ప్రమాద రహిత ప్రయాణాన్ని అందించాలి

పాతగుంటూరు: ప్రమాద రహిత ప్రయాణాన్ని ప్రజలకు అందించేందుకు ఆర్టీసీ డ్రైవర్లు తగిన జాగ్రత్తలు పాటించాలని డీఎస్పీ సీతారామయ్య అన్నారు. 33వ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం గుంటూరు-1 ఆర్టీసీ డిపో గ్యారేజీలో సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఎస్పీ పాల్గొని మాట్లాడుతూ డ్రంక్ అండ్ డ్రైవ్, సెల్ ఫోన్‌డ్రైవింగ్ వల్ల ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణా అధికారిణి జి.విజయగీత, డెప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ నర్రా శ్రీనివాసరావు, డిపో మేనేజర్లు అబ్దుల్ సలాం, రామకృష్ణారావు, ఆర్టీసీ సిబ్బంది, సూపర్‌వైజర్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.

గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాధిపతిగా డాక్టర్ కవిత



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాధిపతి డాక్టర్ అనుమల కవిత విధుల్లో చేశారు. విజయవాడలో పనిచేస్తున్న ఆమెను మ్యూచువల్ బదిలీల్లో భాగంగా గుంటూరు జీజీహెచ్‌కు బదిలీ చేశారు. గుంటూరులో పనిచేస్తున్న డాక్టర్ జగన్‌మోహన్‌ను విజయవాడ సిద్దార్థ మెడికల్ కళాశాలకు బదిలీ చేశారు. విభాగాధిపతిగా విధుల్లో చేరిన డాక్టర్ కవితను శుక్రవారం పలువురు వైద్యులు అభినందించారు.

అచ్చెన్నాయుడు... వ్యాఖ్యలు వెనక్కి తీసుకో...

నెహ్రూనగర్: రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి ప్రజలకు సమాజానికి ఎనలేని కృషి చేస్తూ సమాజ శ్రేయస్సు కోసం సమాజ రక్షణ కోసం పనిచేస్తున్న పోలీసులపై టీడీపీ నాయకుడు అచ్చెన్నాయుడు అగౌరవ పరుస్తూ అసభ్య పదజాలంతో దూషించడం సమంజసం కాదని, ఇటువంటి వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని పోలీసులకు క్షమాపణ చెప్పాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ బోరుగడ్డ అనిల్ కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

'గండాలయ' మెట్లమార్గం అభివృద్ధికి కృషి



దాత సింహాద్రి వెంకట్రామిరెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆర్కే

మంగళగిరి: పానకాల లక్ష్మీ నృసింహస్వామి దేవస్థాన కొండపై వేంచేసియున్న గండాలయ స్వా మి మెట్ల మార్గం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) తెలిపారు. శుక్రవారం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ కొండపై వేంచేసియున్న గండాల స్వామిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చేందుకు సులువుగా ఉండేలా మెట్ల మార్గాన్ని అభివృద్ధి పర్చనున్నట్లు తెలిపారు. నగర పరిధి కాజకు చెందిన దాత సింహాద్రి వెంకట్రామిరెడ్డి సహకారంతో రూ. 4లక్షలతో మెట్ల మార్గాన్ని అభివృద్ధి చేయగా తాజాగా మరి కొన్ని పనులను చేపట్టేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. దాత సింహాద్రి వెంకట్రామిరెడ్డి, ఆలయ ఈఓ రామకోటిరెడ్డి పాల్గొన్నారు.

ఉత్సాహభరితంగా క్రీడా పోటీలు

మంగళగిరి: నగర పరిధిలోని యర్రబాలెం డాన్ బాస్కో ఉన్నత పాఠశాల ఆవరణలో పాఠశాల వ్యవస్థాపకులు జాన్‌బాస్కో వర్ధంతి సందర్భంగా రెండు రోజుల పాటు నిర్వహించతలపెట్టిన కబడ్డీ, ఖోఖో క్రీడాపోటీలు శుక్రవారం ఉత్సాహ భరిత వాతావరణంలో ఉల్లాసంగా ప్రారంభమయ్యాయి. పోటీలను పారిశ్రామికవేత్త నన్నపనేని నాగేశ్వరరావు, మహిళా సంఘం అధ్యక్షురాలు వల్లభనేని వాణిలు ప్రారంభించారు. మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని 14 ఉన్నత పాఠశాలల నుంచి 34 టీమ్‌లకు చెందిన బాలబాలికలు వేర్వేరుగా కబడ్డీ, ఖోఖో పోటీల్లో పోటీల్లో తలపడ్డారు.

ఉత్తమ ఉద్యోగులకు ఘన సత్కారాలు



కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న మల్లేశ్వరరావు



అవార్డు అందుకుంటున్నదినేష్‌కుమార్

పెదకాకాని: సేవాభావంతో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు ఘన సత్కారాలు లభించాయి. గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని కలెక్టర్ ఎం. వేణుగోపాలరెడ్డి, ఉన్నతాధికారుల చేతుల మీదుగా పెదకాకాని మండలంలో విధులు నిర్వహిస్తున్న పలువురు ఉద్యోగులు అవార్డులు అందుకున్నారు. రిపబ్లిక్ డే వేడుకల సందర్భంగా గుంటూరు పోలీసు పేరేడ్ గ్రౌండ్‌లో అవార్డులు అందుకున్న వారిలో పెదకాకాని మండల పరిషత్ పరిపాలనాధికారి బి.వి.మల్లేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ కె.దినేష్‌కుమార్, పంచాయతీరాజ్ ఏఈ వీరమాచినేని జగదీష్, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు, కానిస్టేబుల్ టి.శ్యాంసన్ తదితరులు ఉన్నారు. ఉత్తమ ఉద్యోగి అవార్డు అందుకున్న అధికారులను శుక్రవారం కార్యాలయ సిబ్బంది అభినందించారు.

వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి



నంబూరులో రోగులకు వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ పోతుల సమరకుమార్

పెదకాకాని: గ్రామీణ ప్రాంతాలలో ఉచిత వైద్య సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మల్టిపుల్ జీఎస్‌టీ కో ఆర్డినేటర్ 316 హెచ్ ఎం జేఎఫ్ లయన్ కె.విజయచందర్ అన్నారు. పెదకాకాని మండల పరిధిలోని నంబూరు అంబేద్కర్‌నగర్‌లో శుక్రవారం ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఇంటర్ నేషనల్ లయన్స్‌క్లబ్ ఆఫ్ నంబూరు వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరం ద్వారా గ్రామ ప్రజలు వైద్యసేవలు పొందారు. తాడేపల్లి మణిపాల్ ఆస్పత్రి, గుంటూరు లోటస్ ఆస్పత్రి వారి సంయుక్త సహకారంతో వైద్య పరీక్షలు చేసి వైద్యసేవలు అందించారు. డాక్టర్ పోతుల సమరకుమార్, గైనకాలజిస్ట్ డాక్టర్ పూర్ణిమలు స్త్రీలకు క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించి క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించారు. షుగర్ పరీక్షలు, కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ విజయలక్ష్మి, పీఎసీఎస్ చైర్‌పర్సన్ భీమవరపు కోటిరెడ్డి, లయన్స్‌క్లబ్ సెక్రటరీ అనీల్ సందీప్, ట్రెజరర్ డాక్టర్ కె.ప్రశాంతి, సభ్యులు పాల్గొన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరం ద్వారా 400 మందికి ఆరోగ్య పరీక్షలు చేశారు.

జగనన్న విద్యాజ్యోతి మెటీరియల్‌తో ఎంతో ప్రయోజనం

- ఎమ్మెల్సీ లక్ష్మణరావు
- జెడ్పీ చైర్‌పర్సన్‌కు అభినందనలు



జెడ్పీ చైర్‌పర్సన్ హెనిక్రిస్టినాను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు, ఉపాధ్యాయులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న 36 వేల మంది విద్యార్థులకు జెడ్పీ నిధులతో ఉచితంగా పంపిణీ చేసిన జగనన్న విద్యా జ్యోతి స్టడీ మెటీరియల్ ఎంతో ప్రయోజనం చేకూరుస్తోందని ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు పేర్కొన్నారు. రూ. 60 లక్షల జెడ్పీ నిధులతో రాష్ట్రంలోనే మొదటిసారిగా స్టడీ మెటీరియల్ పంపిణీ చేయడం ద్వారా గుంటూరు జెడ్పీ పాలకవర్గం అన్ని జిల్లాలకు ఆదర్శంగా నిలిచిందని లక్ష్మణరావు పేర్కొన్నారు. ఈసందర్భంగా స్టడీ మెటీరియల్ పంపిణీకి కృషి చేసిన జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనిక్రిస్టినాను శుక్రవారం జెడ్పీ కార్యాలయంలో కలిసి శాలువా కప్పి, జ్ఞాపిక బహూకరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు పి.ఆదిలక్ష్మి, ఎం.కళాధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వమిది

- పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్
- 42వ డివిజన్‌లో గడపగడపకు మన ప్రభుత్వం



నవరత్న సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే గిరిధర్

గుంటూరు వెస్ట్: ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకోవడమే కాకుండా అనుక్షణం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు మద్దాళి గిరిధర్ తెలిపారు. శుక్రవారం 42వ డివిజన్ పరిధిలోని ఇన్‌చార్జ్ చల్లా శేషిరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక వికాస్ నగర్ పరిసర ప్రాంతాల్లో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే గిరిధర్ మాట్లాడుతూ నవరత్న సంక్షేమ పథకాల అమలుతోపాటు కరోనా లాంటి క్లిష్ట సమయాల్లో పేదలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చేసిన పాలన దేశానికే ఆదర్శమన్నారు. అందుకే తాము నిత్యం ప్రజల మధ్యనే తిరుగుతూ వారి సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్నడూ ప్రజల సమస్యలు పట్టించుకునే నాథుడే లేడని చెప్పారు. గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ద్వారా ఇప్పటికీ అనేక సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించామన్నారు. ముఖ్యంగా మహిళా, రైతు పక్షపాతిగా నిలిచిన ముఖ్యమంత్రి రానున్న కాలంలో మరింత సంక్షేమాన్ని ప్రజలకు చేరువ చేస్తారన్నా రు. ప్రజలకు ప్రభుత్వంపై వచ్చిన భరోసాను, నమ్మకాన్ని కాపాడుకుంటామని చెప్పారు. స్థానికులతో మాట్లాడుతూ సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్ సజీల, 42వ డివిజన్ ప్రెసిడెంట్ నల్లమేకల సాంబశివరావు, వెంకయ్య చౌదరి, అట్లూరి చలమారెడ్డి, పాలపర్తి రవీంద్రా రెడ్డి, ఎస్.రామారావు, జోసఫ్, సాంబిరెడ్డి పాల్గొన్నారు.

పాతకక్షల నేపథ్యంలో వ్యక్తిపై దాడి

గుంటూరు ఈస్ట్: పాతకక్షల నేపథ్యంలో వ్యక్తిపై ఇరువురు దాడిచేసిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం బృందావన్ గార్డెన్స్‌కు చెందిన కొత్తమాసు వెంకట సుబ్బారావుకు, పారాకౌశిక్‌కు ఆర్థికపరమైన గొడవలు ఉన్నాయి. ఈనేపథ్యంలో కౌశిక్, నాగేశ్వరరావులు ఈనెల 25వ తేదీన వెంకట సుబ్బారావు ఇంటికి వెళ్లి దాడిచేసి బలవంతంగా కారులో ఎక్కించుకుని వెళ్లారు. అనంతరం వదిలి పెట్టారు. తిరిగి శుక్రవారం కౌశిక్ వెంకట సుబ్బారావుపై దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాటుపాటకు ఆస్కార్ వరిస్తుంది

లక్ష్మీపురం: ఇప్పటికే వరుసగా అనేక అంతర్జాతీయ అవార్డులు సాధించి తెలుగు వారి సత్తా చాటిన నాటు నాటు పాట మేర్చి 12న ప్రకటించే ఆస్కార్ అవార్డుల్లో విజేతగా నిలిచి జెండా ఎగురవేస్తుందని ప్రముఖ గాయకుడు డి.టి సాయిబాబు అన్నారు. స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి ఆధ్వర్యంలో మనమూ పాడుదాం రండి కార్యక్రమం నిర్వహించారు. తెలుగు వా రు ఆశించినట్లుగానే దర్శక ధీరుడు రాజమౌళి రూపొందించినఆర్.ఆర్.ఆర్‌చిత్రంలోని నాటు నాటు పాట ఆస్కార్ నామినేషన్స్‌లో చోటు సాధించడం సంతోషకరమన్నారు.

ఇండోర్, అవుట్‌డోర్ క్రీడల్లో ముగిసిన శిక్షణ



క్రికెట్‌లో శిక్షణ పొందిన విద్యార్థినులతో ప్రిన్సిపాల్ ఎస్వీ రమణ

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతిరోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో ఎంబీఏ, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులకు ఇండోర్, అవుట్‌డోర్ క్రీడల్లో రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ మాట్లాడుతూ క్రీడలు, ఆటల పోటీలను విద్యార్థులే నిర్వహించే విధంగా వారికి శిక్షణ కల్పించామని, తద్వారా విద్యార్థుల్లో క్రియాశీలత, ఏకాగ్రత, జట్టు నిర్వహణ, శారీరక దారుఢ్యం, సంక్షోభ నిర్వహణ, ప్రత్యర్థి వ్యూహం పెంపొందించుకునేందుకు అవకాశం కలుగుతుందన్నారు. కనుమరుగైపోతున్న కబడ్డీ ఆటను ప్రోత్సహించే ధ్యేయంతో సంబంధిత క్రీడను కళాశాలలో నిర్వహించామని చెప్పారు. కబడ్డీతో పాటు ఖో-ఖో, టెన్నికాయిట్, చెస్, కేరమ్స్, వాలీబాల్, షటిల్, క్రికెట్‌ను విద్యార్థులు ఆడారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ చెరువు రామకృష్ణమూర్తి, ప్రిన్సిపాల్ ఎస్వీ రమణ ట్రోఫీతో సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ కె. లలిత, హెచ్‌ఓడీ వి.చక్రవర్తి, సహాయాచార్యులు ఎ.బాజీబాబు, ఎస్. మణికంఠ, సీహెచ్ వేదవతి, ఎస్.అశోక్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

డాక్టర్ నాగూర్‌బాషాకు సన్మానం



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న షేక్ నాగూర్‌బాషా గణతంత్ర దినోత్స వేడుకల్లో డాక్టర్ వేణుగోపాలరెడ్డి చేతుల మీదుగా ఉత్తమ ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం గుంటూరు కొత్తపేటలోని కేర్‌వెల్ సూపర్‌స్పెషాలిటీ హాస్పటల్‌లో డాక్టర్ నాగూర్‌బాషాను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్ షేక్ గౌస్‌బాషా, అర్షిత్‌పటేల్, షేక్ మస్తాన్‌వలి, డాక్టర్ శివశంకర్, డాక్టర్ అస్లాం, డాక్టర్ హర్షవర్ధన్, డాక్టర్ నరేంద్రరెడ్డి, డాక్టర్ యాస్మిన్, పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రేపు కవి సమ్మేళనం

పాతగుంటూరు: నవ్యాంధ్ర రచయితల సంఘం గుంటూరు శాఖ ఆధ్వర్యంలో ఈనెల 29న బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌ఓ సమావేశ మందిరంలో కవి సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు శాఖ జిల్లా పూర్వ అధ్యక్షుడు వై.హెచ్.కె.మోహన్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమంలో శాఖ నూతన కార్యవర్గ బాధ్యతల స్వీకరణ కార్యక్రమం జరుగుతోందని తెలిపారు.

రేపు 'నాగలికి నా నమస్కారం 'సంపుటి ఆవిష్కరణ

పాతగుంటూరు: జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 29న బ్రాడీపేటలోని కొరిటాల సమావేశ మందిరంలో ప్రముఖ రచయిత సోమేపల్లి వెంకటసుబ్బయ్య రచించిన ''నాగలికి నా నమస్కారం'' నానీల సంపుటి ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంఘ ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం .సుభాని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు డాక్టర్ వెలుగోలు నాగ రాజ్యలక్ష్మి అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో కవులు, సాహితీ ప్రియులు పాల్గొనాలని కోరారు.

ఫోన్ చేసుకోవాలంటూ.. బ్యాలెన్స్ నొక్కేశాడు!

పోలీసునాశ్రయించిన బాధితుడు

గుంటూరు ఈస్ట్: గుర్తుతెలియని వ్యక్తి ఎలక్ట్రికల్ షాపు యజమానిని మోసం చేసిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏటీఅగ్రహారం 5వ లైనుకు చెందిన అల్లంశెట్టి భాస్కరరావు ఏటీ అగ్రహారం మెయిన్‌రోడ్డులో ఎలక్ట్రికల్‌షాపు నిర్వహిస్తున్నాడు. గత సంవత్సరం డిసెంబరు 2వ తేదీ గుర్తుతెలియని వ్యక్తి ఎలక్ట్రికల్ షాపునకు వచ్చి భాస్కరరావుతో తన సెల్‌ఫోన్‌లో బ్యాలెన్స్ అయిపోయిందని, ఫోన్ చేసేందుకు సెల్ ఇవ్వాలని కోరాడు. భాస్కరరావు నమ్మి గుర్తుతెలియని వ్యక్తికి సెల్ ఇచ్చాడు. కొంతసేపటి తరువాత ఆ వ్యక్తి భాస్కరరావుకు సెల్ తిరిగి ఇచ్చాడు. అయితే 3వ తేదీ ఉదయం భాస్కరరావు అకౌంట్‌లో రూ. 32 వేలు విత్‌డ్రా అయినట్లు మెసేజ్ వచ్చింది. వెంటనే సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనంతరం శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సోదరిని మోసం చేసిన ఘటనపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: మహిళ తన సోదరిని మోసం చేసి ఆస్తి రాయించుకున్న ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాకుమానువారితోటకు చెందిన మన్నెంకుమారికి విజయనగరంలో స్థలం ఉంది. మన్నెంకుమారి ఆ స్థలం విక్రయించగా వచ్చిన డబ్బును తన సోదరి లక్ష్మీకి ఇచ్చి గుంటూరులో ఓ స్థలం కొనుగోలు చేయాలని కోరింది. లక్ష్మీ గుంటూరులో స్థలం కొనుగోలు చేసినట్లు నమ్మించి కుమారిని గుంటూరులోని సబ్ రిజిస్ట్రారు కార్యాలయానికి తీసుకెళ్లింది. స్థలం కొనుగోలు చేస్తున్నానని నమ్మి సోదరిపై నమ్మకంతో కుమారి డాక్యుమెంట్లు చదవకుండానే సంతకాలు చేసింది. కొంత కాలం తరువాత కుమారి పేరు మీద ఉన్న ఇంటిని లక్ష్మీ కొనుగోలు చేసినట్లుగా డాక్యుమెంట్లు చూపించింది. కుమారి తాను రిజిస్ట్రారు కార్యాలయంలో సంతకం పెట్టింది ఇంటిని తన సోదరికి విక్రయించినట్లు ఉన్న విషయం గుర్తించింది. తాను మోసపోయినట్లు నిర్ధారించుకుని కుమారి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రముఖ సినీ నటి జమునకు ఘన నివాళి



నివాళి కార్యక్రమంలో పాల్గొన్న గోపీ కుమార్, వీరాంజనేయులు, తదితరులు

పాత గుంటూరు: ప్రముఖ సినీ నటి జమున మృతి పట్ల గుంటూరు కళా సంస్థల ప్రతినిధులు, కళాకారులు, సినీ అభిమానులు సంతాపం వ్యక్తం చేశారు. అమరావతి రోడ్డు భారత్‌పేటలోని సేవా సదన్ కార్యాలయ ఆవరణలో భారతీ సాంస్కృతిక సంగీత కళావేదిక వ్యవస్థాపకుడు మిరియాల ప్రసాదరావు ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొని జమున చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సేవాసదన్ అధ్యక్షుడు మిరియాల గోపీకుమార్, ఏపీ పంచాయతీ పరిషత్ అధ్యక్షులు డాక్టర్. జాస్తి వీరాంజనేయులు, మేకల పురుషోత్తమ ప్రసాద్, దళవాయి సుబ్రహ్మణ్యం, మేకల రవీంద్రబాబు, యర్రగోపు నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

గుంటూరుతో జమునకు అనుబంధం..

ప్రముఖ సినీ నటి జమున మృతిని సినీ అభిమానులు జీర్ణించు కోలేకపోతున్నారు. గుంటూరుతో ఆమెకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. 1983వ సంవత్సరంలో గుంటూరులో దాసరి కల్చరల్ అకాడమీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. 2017లో వంశీ ఇంటర్నేషనల్ జీవిత సాఫల్య పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమంలో పాల్గొని పొత్తూరి రంగారావుకు పురస్కారాన్ని అందించారు.

తక్కువ పెట్టుబడి.. ఎక్కువ రాబడులు!

- చిరుధాన్యాల సాగుపై అవగాహన సదస్సు
- పాల్గొన్న లాం ఫాం శాస్త్రవేత్తలు



మాట్లాడుతున్న వ్యవసాయశాఖాధికారి నున్నా వెంకటేశ్వర్లు, శాస్త్రవేత్తలు

మంచాల(చేబ్రోలు): తక్కువ నీరు, తక్కువ ఎరువులు, తక్కువ పురుగు మందులతో పాటు తక్కువ పెట్టుబడితో చిరుధాన్యాలు అధిక దిగుబడులను ఇస్తాయని లాం ఫాం శాస్త్రవేత్త గంగాదేవి అన్నారు. 2023 సంవత్సరాన్ని కేంద్ర ప్రభుత్వం అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించింది. ప్రతినెలా చేపట్టాల్సిన కార్యక్రమాలను రూపొందించింది. దీనిలో భాగంగా చేబ్రోలు మండలం మంచాల గ్రామంలోని శివాలయం వద్ద వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం చిరుధాన్యాలను ప్రోత్సహించడానికి రైతు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో శాస్త్రవేత్తలు గంగాదేవి, ఎం.దీపలు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో చిరుధాన్యాలైన జొన్న, సజ్జ, రాగి, కొర్ర, వరిగ, సామ, ఆరిక, ఊద, అంటుకొర్రలు 9 రకాల చిరుధాన్యాలు సాగుకు అనుకూలమైన వాతావరణ పరిస్థితులు ఉన్నాయన్నారు. ప్రపంచంలోనే అత్యధికంగా చిరుధాన్యాలను సాగు చేసే దేశం భారతదేశం అన్నారు. చిరుధాన్యాలను- పేద వారి ఆహారంగా గుర్తింపు పొందాయన్నారు. కోవిడ్ -19 మహమ్మారి తరువాత చిరుధాన్యాల పోషక విలువలకు ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. పీచుపదార్థాలు, ప్రోటీన్లు, కొవ్వులు, పిండిపదార్థాలు, విటమిన్లు, మినరల్స్ కలిగే ఉండే చిరుధాన్యాల వల్ల మనుషుల్లో పోషకార లోపం సూక్ష్మ పోషక లోపాలను నివారిస్తాయన్నారు. మన రాష్ట్రంలో 2.10 లక్షల హెక్టార్లలో వివిధ రకాల చిరుధాన్యాలు సాగు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యవసాయశాఖాధికారి నున్నా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవటం వలన రక్తపోటును, కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుందన్నారు. మధుమేహం, స్థూలకాయం, ఆస్తమాను నివారిస్తుందన్నారు. సంపూర్ణ ఆరోగ్యం చిరుధాన్యాలతోనే సాధ్యమవుతుందన్నారు. పొన్నూరు ఏడీఏ సీహెచ్ తిరుమలాదేవి, ఏవో బి.శ్రీనివాసనాయక్, ఏఈవో కె.సునీత, వీఏఏ కె రమ్య స్థానిక రైతులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి వైద్య సేవలు అందించడమే లక్ష్యం



పెద్దివారిపాలెంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రవి ప్రసాద్, శ్యామ్

పెద్దివారిపాలెం (కాకుమాను): గ్రామాల్లో ప్రతి ఇంటికీ వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఫ్యామిలీ ఫిజీషియన్ అనే కార్యక్రమం చేపట్టినట్లు కాకుమాను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రవి ప్రసాద్ అన్నారు. మండలంలోని పెద్దివారిపాలెం గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి ప్రసాద్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి ఇలాంటి కార్యక్రమం చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం వలన వృద్ధులు, వికలాంగులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. పక్షవాతం, గుండె సంబంధిత వ్యాధిగ్రస్తులు సకాలంలో మందులు తీసుకుంటున్నారా లేదా, సమయానికి మంచి ఆహారం తీసుకుంటున్నారా లేదా అనే విషయాలను గుర్తించి వారికి సకాలంలో వైద్య సేవలు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి సబ్ సెంటర్లో నెలలో రెండుసార్లు వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా 120 మందికి బీపీ, షుగర్ వంటి అనేక వ్యాధులకు సంబంధించిన పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో 104 వాహనం వైద్యులు డాక్టర్ శ్యాం, ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అనుగుణంగా రహదారి విస్తరణ పనులు

నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు



వివరాలు తెలుసుకుంటున్న మేయర్ కావటి

పట్నంబజారు: గుంటూరు నగరంలో నానాటికీ పెరుగుతున్న ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకుని రోడ్డు విస్తరణలు చేపట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు చెప్పారు. శుక్రవారం గుంటూరు నగరంలోని హిందూ కళాశాల కూడలి వద్ద కాంగ్రెస్ పార్టీ కార్యాలయ రోడ్డులో విస్తరణ పనులను శుక్రవారం నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక అధికారులతో కలిసి పరిశీలించారు. మేయర్ కావటి మాట్లాడుతూ నగరంలో ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా అవసరమైన ప్రాంతాల్లో విస్తరణకు చర్యలు తీసుకుంటున్నామని, హిందూ కళాశాల సమీపంలోని కాంగ్రెస్ కార్యాలయం వద్ద విస్తరణ చేపడుతున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో ఆ రోడ్డులోని స్థలాలు, నిర్మాణాలు కోల్పోతున్న భవన యజమానులను వ్యక్తిగతంగా కలిసి రోడ్డు విస్తరణకు సంబంధించిన అవసరాన్ని వివరించటంతో పుష్పాన్ని అందజేసి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

సామాన్య ప్రజలకు న్యాయాన్ని అందించాలి



సన్మాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

గుంటూరు లీగల్: ప్రభుత్వం తరపున నియమితులైన న్యాయాధికారులు సామాన్య ప్రజలకు న్యాయాన్ని అందించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు పోలూరి వెంకటరెడ్డి సూచించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ నుంచి ఉత్తమ ఏపీపీ అవార్డులు అందుకున్న వారితోపాటు స్పెషల్ పీపీ, ఎండోమెంట్ స్టాండింగ్ కౌన్సిల్‌గా నిమితులైన వారికి సన్మాన కార్యక్ర మాన్ని శుక్రవారం కోర్టు ప్రాంగణంలో నిర్వహించారు. కార్యక్రమంలో పోలూరి మాట్లాడుతూ స్పెషల్ పీపీ, ఎండోమెంట్ స్టాండింగ్ కౌన్సిల్స్, ఉత్తమ అవార్డులు అందుకున్న ఏపీపీలకు అభినందనలు తెలిపారు. కర్నూలు, కడప, అనంతపురం జిల్లాల ఎండోమెంట్ స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమితులైన నాగరాజు, పశ్చిమ గోదావరి జిల్లా ఎండోమెంట్ స్టాండింగ్ కౌన్సిల్‌గా నిమిమితులైన బలభద్రపాత్రుని వెంకట గౌరీ శంకర్, పోక్సో కోర్టుకు స్పెషల్ పీపీగా నియమితులైన శ్యామల, ఉత్తమ ఏపీపీలుగా కలెక్టర్ నుంచి అవార్డు లు అందుకున్న వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, వి.సూరిబాబు, శ్రీకాంత్‌లను శాలువాలతో సన్మానించారు.

సచివాలయాల్లో ఆధార్ సెంటర్‌లు

పట్నంబజారు: నగరంలోని వార్డు సచివాలయాల్లో ఆధార్ సెంటర్‌లు ఏర్పాటు చేశామని, నగర ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ పి. రోజా చెప్పారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలోని 207 వార్డు సచివాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ సెంటర్‌ను పరిశీలించారు. అదనపు కమిషనర్ రోజా మాట్లాడుతూ నగరంలో ప్రజలకు ఆధార్ సేవలు అందించేందుకు తొమ్మిది సచివాలయాల్లో ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు